
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సిద్దిపేట 7
గురువారం 13 జూన్ 2024





సిద్దిపేట బాలికల పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

మోగిన బడి గంట

● విద్యార్థులకు స్వాగతం పలికిన ఉపాధ్యాయులు

సిద్దిపేట క్రైం, జూన్ 12 : వేసవి సెలవుల అనంతరం బుధవారం పాఠశాలలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు విచ్చేశారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు పాఠశాలకు తోరణాలు కట్టి విద్యార్థులకు స్వాగతం పలికారు. ప్రభుత్వ ఆదేశానుసారం సర్కారు స్కూళ్లల్లో మొదటిరోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫాంలను పంపిణీ చేశారు. కొంతమంది తల్లిదండ్రులు సిద్దిపేట ప్రభుత్వ బాలికల పాఠశాలలో అడ్మిషన్ కావాలని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డిని కోరడంతో తానే స్వయంగా అడ్మిషన్ దరఖాస్తును నింపి పాఠశాల ప్రిన్సిపాల్‌కు అందజేశారు.



తరగతి గదికి తోరణాలు కడుతున్న విద్యార్థిని



సిద్దిపేట బాలికల పాఠశాలలో అడ్మిషన్ కావాలని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డిని అడుగుతున్న తల్లిదండ్రులు

వక్ఫ్ స్థలాల్లో యథేచ్ఛగా నిర్మాణాలు

పత్తాలేని టాస్క్‌ఫోర్స్ కమిటీ.. కొరవడిన అధికారుల పర్యవేక్షణ



వక్ఫ్ స్థలంలో నిర్మాణం

గజ్వేల్, జూన్ 12: గజ్వేల్ పట్టణంలో వక్ఫ్ భూముల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. లీజు, కొనుగోలు పేరుతో కోట్ల రూపాయల విలువ చేసే భూములను దర్జాగా ఆక్రమించి, శాశ్వత నిర్మాణాలను చేపడుతున్నారు. వక్ఫ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారుల్లో ఎలాంటి స్పందన కనిపించడం లేదు. ప్రభుత్వం మారడంతో అక్రమార్కులు యథేచ్ఛగా ఇళ్లను నిర్మించుకోవడం, వక్ఫ్ స్థలాలను ఆక్రమించుకోవడం చేస్తున్నారు. జిల్లాలో వక్ఫ్, ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాల కట్టడి చేయడానికి ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ కమిటీ పత్తా లేదు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని, మున్సిపల్ అధికారులు కేవలం టాస్క్‌ఫోర్స్ కమిటీకి సిఫారసు చేసి వదిలేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఎక్కువగా వక్ఫ్ భూములే

గజ్వేల్ పట్టణంలో సగానికిపైగా వక్ఫ్ భూములే ఉన్నాయి. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వెనకాల మొదలుకుని, ఐవోసీ కార్యాలయం, జాలిగామ బైపాస్ రోడ్డు, తూప్రాన్ రోడ్డు, రింగ్ రోడ్డు, జాలిగామ రోడ్డు, సంగాపూర్ రోడ్డు, హౌజింగ్ బోర్డు కాలనీ, భారత్‌నగర్ ఇలా మేజర్ ప్రాంతాల్లో వక్ఫ్ భూములు ఉన్నాయి. మొత్తంగా 330 ఎకాల భూములు ఉన్నట్లు సమాచారం. ఈ ప్రాంతాల్లో భూముల ధరలకు మంచి డిమాండ్ ఉంది. చదరపు గజం ధర రూ.20వేల వరకు పలుకుతుండడంతో ఆక్రమణదారుల కన్ను వక్ఫ్ భూములపై పడింది. స్థానిక నాయకులకు నయానో... భయానో ఇచ్చి, అధికారులకు కొంత ముట్టజెప్పి వక్ఫ్ స్థలాలను కబ్జా చేస్తున్నారు. దర్జాగా నిర్మాణాలను చేపడుతున్నారు. వక్ఫ్ అధికారులు వస్తే ఇతర శాఖ అధికారులు సహకరించడం లేదని, ఇతర శాఖ అధికారులు వస్తే వక్ఫ్ అధికారులు రావడం లేదని ఒకరిపై ఒకరు తోసివేస్తూ కాలం వెళ్లదీస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

స్పందించని అధికారులు

మున్సిపాలిటీ పరిధిలోని జాలిగామ బైపాస్ రోడ్డుతో పాటు తిరుమల థియేటర్ ఏరియాల్లోని వక్ఫ్ స్థలాల్లో నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదు. కబ్జాదారులు స్థానిక నాయకులను మచ్చిక చేసుకుని తమ పనిని తాము చక్కబెట్టుకుంటున్నారు. జాలిగామ బైపాస్ రోడ్డులో గతంలో ఒకటో, రెండో నిర్మాణాలు ఉండగా ప్రస్తుతం రోడ్డు వెంట అన్నీ నిర్మాణాలే దర్శనమిస్తున్నాయి. రాత్రికిరాత్రి నిర్మాణాలు చేపడుతున్నా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఎందుకు నిర్మాణాలను అడ్డుకోవడం లేదో అర్థం కానీ పరిస్థితి ఉంది. మున్సిపాలిటీ నుంచి మొదలుకుని జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల వరకు అందరికీ ఫిర్యాదులను అందిస్తున్నా, క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.



గజ్వేల్ పట్టణంలోని జాలిగామ బైపాస్ రోడ్డులో వక్ఫ్‌బోర్డు స్థలంలో చేపడుతున్న నిర్మాణం

మాండవ్యనదిగా పేరున్న కూడవెల్లి వాగు ఒడ్డున వెలిసిన భూంపల్లి- అక్బర్‌పేట మండలంలోని రామేశ్వరంపల్లి రామలింగేశ్వర ఆలయాన్ని కేంద్ర ప్రభుత్వం 'ప్రసాద్' పథకానికి 2022 అక్టోబరులో ఎంపిక చేసింది. ఈ పథకం కింద రూ.40 కోట్ల వరకు నిధులను కేటాయించి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. అయితే, పనులు మాత్రం పట్టా లెక్కలేదు. రామలింగేశ్వరుడి సన్నిధిలో ఆడుతూ పెరిగిన మాధవనేని రఘునందన్‌రావు ఎంపీగా గెలవడంతో ఆలయాభివృద్ధిపై భక్తుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

- దుబ్బాక, జూన్ 12



రామలింగేశ్వరస్వామి

'ప్రసాద్'తో ప్రభవించేనా?

రెండేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వ పథకానికి ఎంపికైన రామలింగేశ్వరాలయం



ప్రసాద్ పథకం నిర్మాణాలకు కేటాయించిన భూమి

● రూ.40 కోట్లతో అభివృద్ధి పనులకు ఆస్కారం
● వసతుల కల్పనకు ఇప్పటికే భూమి కేటాయింపు
● ఎంపీగా రఘునందన్ గెలుపుతో అభివృద్ధిపై ఆశలు


రాష్ట్రంలో కూడవెల్లి రామలింగేశ్వరాలయంతోపాటు మహబూబ్‌నగర్ జిల్లా మన్యంకొండ వెంకటేశ్వరాలయం, నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి రామాలయం, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరాలయం కూడా ప్రసాద్ పథకం కింద ఎంపికయ్యాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి పనులకు ప్రతిపాదనలను కూడా కోరింది. అందుకు రామలింగేశ్వర ఆలయం సమీపంలోని 887 సర్వే నంబర్‌లో ఎకరా 13 గుంటలు, 888లో మూడు ఎకరాల ఆరుగుంటలు, 880లో రెండు ఎకరాల 29 గుంటలు, 890లో ఒక ఎకరా 35 గుంటల భూమిని దేవాదాయ కమిటీ సేకరించింది. మొత్తం 9 ఎకరాల మూడు గుంటల భూమిని సేకరించి, అందులో ఒక ఎకరా భూమిని ప్రసాద్ పథకం కిందా మంజూరయ్యే అభివృద్ధి పనుల నిర్మాణాలకు కేటాయించారు. ఇందులో 20 రకాల వసతులను కల్పించనున్నారు. ప్రసాద్ పథకం కింద ఏర్పాటు చేయనున్న వసతులకు ఈ భూమిని కేటాయిస్తూ సర్వే నివేదికను కూడా అప్పగించింది. ఇందులో భక్తులకు మూత్రశాలలు, వెయిటింగ్‌హాల్, తాగునీటి వసతి, ప్రసాదం కౌంటర్‌లు, ప్రాథమిక విచారణ కేంద్ర భవనం, ప్రథమ చికిత్సాలయం, లాకర్‌రూం, క్లాక్‌రూం, క్యాంటీన్, ఏటీఎం సెంటర్, బల్లలు, మల్టీపర్పస్‌హాల్, పార్కింగ్, సోలార్‌ప్యానల్, రెయిన్‌వాటర్ హార్వేస్టింగ్, ప్రహరీ, సీసీ టీవీలు, చెత్తసేకరణ వస్తువులు, తదితర వసతులను కల్పించనున్నారు. దశల వారీగా స్నానపు ఘట్టాలు, వాగుపైరోప్‌వే, శిథిలావస్థలో ఉన్న ఆలయాల జీర్ణోద్ధరణ కార్యక్రమానికి కూడా నిధులు కేటాయిస్తారని ఆశించారు. గత ప్రభుత్వం సీడీఎఫ్ నిధుల కింద అప్పటి ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి చొరవతో రూ.1.25 కోట్లను మంజూరు చేసింది. అందులో ప్రాకారాలు, మినీ రాజగోపురం, వేణుగోపాల స్వామి ఆలయం పునరుద్ధరణ పనులను చేపట్టారు. అయితే, మరికొన్ని నిధులు నిలిచిపోయాయి. సీడీఎఫ్ నిధులను కాంట్రాక్టర్ పూర్తిస్థాయిలో వెచ్చించలేకపోయారు. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో పాటు, కొత్త ప్రభుత్వంలో నిధుల కొరత ఏర్పడటంతో పనులు అసంపూర్తిగానే మిగిలాయి.

శిథిలావస్థలో ఆలయాలు

కూడవెల్లి రామలింగేశ్వరాలయం శైవ, వైష్ణవ సంప్రదాయం ప్రకారం ఏర్పడిన క్షేత్రం. ఆలయం వద్ద వేణుగోపాల స్వామి, సంగమేశ్వర స్వామి, గణపతి, వీరభద్రస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, కాశీవిశ్వనాథ స్వామి, బొబ్బిలి వీరన్న ఆలయాలు వెలిశాయి. ప్రస్తుతం ఇందులో సగానికిపైగా ఆలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటి పునరుద్ధరణకు ప్రసాద్ పథకం ద్వారా అవకాశం లభిస్తుందని ఆశిస్తున్నారు.

పర్యాటక క్షేత్రంగా..

దేశంలో ఎక్కడ లేని విధంగా ఎదురుగా.. అంటే తూర్పునుంచి పడమరకు ప్రవహించే నది కేవలం కూడవెల్లి వాగుగా చెప్పుకుంటారు. తూర్పున కూడవెల్లి పెద్ద వాగు, దేవాలయ పశ్చిమ నుంచి చిన్నవాగు, అంతర్వాహినిగా సరస్వతీ వాగు పారుతుంది. దీంతో దీనిని త్రివేణీ సంగమంగా పిలుస్తారు. జీవనదిగా ఉన్న వాగు మూడు దశాబ్దాలుగా చుక్కనీరులేక వట్టిపోయింది. రెండేళ్ల నుంచి మల్లన్నసాగర్ నీటిని అందించడంతో జలకళతో ఉట్టిపడుతుంది. మాఘస్నానాలతోపాటు లక్షలాది మంది భక్తులు ఆలయం వాగు వద్ద స్నానం ఆచరించి, రామలింగేశ్వరుడిని సందర్శించుకోవడం పరిపాటి. దేవాలయం వద్ద వసతులను అందించి, చిల్డ్రన్ పార్క్‌తోపాటు, ఎనగుర్తి గ్రామం వరకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలనే డిమాండ్ దశాబ్దాలుగా మగ్గుతుంది. దీంతో రాకపోకలు పెరుగుతాయి. వాగుపై రోప్‌వే, స్నానపు గదులు, కాజ్‌వే నిర్మించి, అందంగా తీర్చిదిద్దితే పర్యాటక క్షేత్రంగా విలసిల్లే అవకాశం ఉంది.



రామలింగేశ్వర క్షేత్రంలో శిథిలావస్థలో ఉన్న ఆలయాలు

ఆస్తి కోసం కన్నతల్లిని హతమార్చిన కుమారుడు



సత్తవ్వ (ఫైల్)

చిన్నకోడూరు, జూన్ 12 : ఆస్తి కోసం కుమారుడే తల్లిని కొట్టి చంపిన హృదయ విదారక ఘటన సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం గంగాపూర్ గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గంగాపూర్ గ్రామానికి చెందిన అంతగిరి మల్లయ్యకు ఇద్దరు భార్యలు (సొంత అక్కాచెల్లెలు) మొదటి భార్య సత్తవ్వ(70)కు కుమారుడు చంద్రశేఖర్, రెండో భార్య పోచవ్వకు ఇద్దరు కుమారులు ఉన్నారు. సత్తవ్వ కూలీ పనులు చేస్తూ ఒంటరిగా జీవిస్తూ ఉండేది. సత్తవ్వ పేరు మీద 5 ఎకరాల వ్యవసాయ భూమి ఉండటంతో ఆ భూమిని తన పేరు మీద చేయాలని కొద్ది రోజులుగా చంద్రశేఖర్ ఒత్తిడి చేస్తున్నాడు. సత్తవ్వ ఇద్దరు అక్కాచెల్లెలం సమానంగా తీసుకుంటామని చెప్పడంతో సత్తవ్వతో చంద్రశేఖర్ తరచూ గొడవ పడుతుండేవాడు. మంగళవారం అర్ధరాత్రి చంద్రశేఖర్ తల్లి సత్తవ్వ కాలకృత్యాలకు వెళ్లి కాలు జారీ పడటంతో తీవ్ర గాయ్యాలయ్యానని వేరే ఇంట్లో ఉంటున్న తండ్రి మల్లయ్యకు తెలిపాడు. మల్లయ్య వెంటనే సత్తవ్వ ఉంటున్న ఇంటికి వెళ్లి చూసే సరికి గాయాలతో ఉంది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు సత్తవ్వ అప్పటికే మృతి చెందిదని నిర్ధారించారు. సత్తవ్వ మృతదేహన్ని గంగాపూర్‌కు తీసుకువచ్చారు. కొద్ది రోజులుగా చంద్రశేఖర్ తన తల్లి సత్తవ్వతో ఆస్తి విషయంలో గొడవ పడతుండటంతో అనుమానం వచ్చిన మల్లయ్య సత్తవ్వ మృతదేహన్ని పరిశీలించగా తల వెనక, శరీరంపై అక్కడక్కడ బలమైన రక్త గాయాలు కన్పించాయి. బుధవారం మధ్యాహ్నం సమాచారం అందుకున్న సిద్దిపేట ఏసీపీ మధు, దుబ్బాక సీఐ శ్రీనివాస్, చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం సత్తవ్వ మృతదేహన్ని ఓ ప్రైవేట్ వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్తి కోసమే చంద్రశేఖర్ తన తల్లి సత్తవ్వను కొట్టి చంపాడని తండ్రి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



జెండా ఊపుతున్న ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఏ సమస్య వచ్చినా ముందుంటా..

● ఎంపీ రఘునందన్‌రావు

సిద్దిపేట క్రైం, జూన్ 12: మెదక్ పార్లమెంటరీ ప్రజలకు ఏ సమస్య వచ్చినా ముందుండి పోరాడుతానని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేట శరభేశ్వర ఆలయంలో అమర్నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన శివ పార్వతుల కల్యాణ మహోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అమర్నాథ్ సేవా సమితి ఆధ్వర్యంలో అమర్నాథ్ యాత్రకు వెళుతున్న అన్నదాన సరుకుల లారీని ఎంపీ రఘునందన్‌రావు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే హరీశ్‌రావు కలుసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన రఘునందన్‌రావుకు హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నికల వేళ ఒకరిపై ఒకరు విమర్శల గుప్పించుకున్న వారిద్దరూ ఇప్పుడు కలుసుకోని మాట్లాడుకోవడం గమనార్హం.

డీఎస్సీలో 25 వేల పోస్టులు భర్తీ చేయాలి

● మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట క్రైం, జూన్ 12 : కాంగ్రెస్ ప్రభుత్వం 25 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పి 11 వేల పోస్టులకే డీఎస్సీ నోటిఫికేషన్ వేసిందని, ఇచ్చిన మాట ప్రకారం 25 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు కోరారు. బుధవారం పాఠశాలల ప్రారంభం నేపథ్యంలో సిద్దిపేట ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఆయన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫామ్‌లు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అన్ని ప్రభుత్వ స్కూళ్లకు పారిశుధ్య సిబ్బందిని నియమించి, ఉచిత కరెంట్ ఇవ్వాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తల్లిదండ్రుల ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి విద్యార్థులకు మెరుగైన విద్య అందించిందన్నారు. సిద్దిపేటలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుకున్నామన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం కూడా మన ఊరు మనబడి కార్యక్రమాన్ని కొనసాగించి ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేయాలని కోరుకుంటున్నానని తెలిపారు. సిద్దిపేట ప్రభుత్వ బాలుర పాఠశాలలో హాస్టల్‌కి వెంటనే డైనింగ్ రూమ్ మంజూరు చేయించుకుని ప్రారంభించుకుందామని హామీ హరీశ్‌రావు ఇచ్చారు.

విద్యాశాఖ అధికారులతో సమీక్ష

సిద్దిపేట టౌన్, జూన్ 12: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిద్దిపేట నియోజకవర్గంలోని విద్యా శాఖ అధికారులు ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌లతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో సిద్దిపేట పాఠశాలలు అద్భుత ఫలితాలు సాధించాయని ప్రశంసించారు. గత ఐదేళ్లుగా అగ్రగామిగా నిలుస్తున్న సిద్దిపేట వచ్చే ఏడాది తొలిస్థానంలో నిలిచేందుకు కృషి చేయాలని కోరారు. చిన్నకోడూరు ప్రభుత్వ పాఠశాలలో పదిమంది విద్యార్థులు పదికి పది జీపీఏ సాధించడం సిద్దిపేటకు గర్వకారణమన్నారు. నియోజకవర్గంలోని 27 ప్రభుత్వ పాఠశాలల్లో 75మంది విద్యార్థులు పదికి పదికి జీపీఏ సాధించారని తెలిపారు. నియోజకవర్గంలోని 67 ప్రభుత్వ పాఠశాల్లో 60 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. ఇది రాష్ట్ర రికార్డు అని, ఇదే స్ఫూర్తి కొనసాగించాలని, అందుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. పదికి పది జీపీఏ సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను అభినందిస్తూ సభ నిర్వహించి సన్మానించాలని అధికారులకు సూచించారు. విద్యాసంవత్సరం మొదలైనందున పాఠశాలల భవనాలకు రిపేర్లు, పెండిగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

వైద్య సేవలు ఎలా ఉన్నాయి

సిద్దిపేటలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అనుబంధ మెడికల్ కళాశాలలో రోగులకు వైద్య సేవలు ఎలా అందుతున్నాయంటూ మాజీ మంత్రి, సిద్దిపేట హరీశ్‌రావు ఆరా తీశారు. బుధవారం ఆయన ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించారు. రోగులను, వారి బంధువులను ఆత్మీయంగా పలకరిస్తూ అన్ని విభాగాలను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందిస్తున్న వివిధ వైద్య సేవల గురించి ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది, ఫార్మాసిస్టులతో, పేషెంట్లతో, వారి బంధువులతో ముచ్చటించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, నాయకులు పాల సాయిరాం, పెర్క మధు తదితరులు ఉన్నారు.

ఖాత గుట్టపై కొత్త రాతియుగం ఆనవాళ్లు

నంగునూరు, జూన్ 12 : మండలంలోని ఖాత గుట్టపైన కొత్త రాతి యుగానికి చెందిన ఆదిమానవులు జీవించినట్లు చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్ రెడ్డి తెలిపారు. ఖాత గ్రామంలో పర్యటించిన ఆయన పలు విశేషాలను గుర్తించి బుధవారం వివరాలను వెల్లడించారు. విశాలమైన ఉపరితలంతో కూడిన ఏకశిలగా ఉన్న ఖాత గుట్టపై నీటి నిల్వలు, నీటి గుండాలు ఉన్నాయని, చుట్టూ అడవి, సాగు యోగ్యమైన నేల, గుట్ట వెనుకవైపు చెరువు ఇవన్నీ ఆవాస యోగ్యమైన ఆనవాళ్లుగా గుర్తించినట్లు తెలిపారు. కొత్త రాతి యుగం, పెద్ద రాతి యుగం, అనంతర కాలానికి చెందిన చారిత్రక ఆధారాలు లభ్యమైనట్లు పేర్కొన్నారు. గ్రామ పోచమ్మ గుడి సమీపంలో 20కిపైగా గ్రూవ్‌లు ఒకదాని పక్కన మరొకటి దగ్గరదగ్గరగా ఉన్నాయని చెప్పారు. పనిముట్లను తయారు చేసుకునే ఈ గ్రూవ్స్‌ని స్థానికులు దేవుని పాదాలుగా భావించి పూజిస్తున్నారని తెలిపారు. గుట్ట దిగువ ప్రాంతంలో చిన్న జలబుగ్గ సైతం గుర్తించినట్టు రత్నాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జలబుగ్గ మీద రెండు వేల ఏళ్ల కిందటి డోల్మెన్ రకపు బృహద్ శిలా సమాధిని గుర్తించామని, రాతిగుట్టపై క్వారి పనులు జరగడంతో ఆధారాలు కనుమరుగు అవుతున్నాయని తెలిపారు. గుట్ట పూర్తి ఉపరితలంపై హనుమాన్ విగ్రహం వద్ద మూడు చోట్ల ఇటుకల నిర్మాణం ఉందని, ఇది ధ్వంసమైనా కింది వరుస కనిపిస్తున్నదని ఇవి బౌద్ధ స్తూపాలు, జైన మతానికి చెందిన నిర్మాణాలు అయి ఉండవచ్చని చెప్పారు. గుట్టపై ఒక నీటి గుండం నిండి కిందికి ప్రవహించే చోట సహజ సిద్ధమైన వృత్తాకార లోతైన రూపం ఏర్పడిందని తెలిపారు. పూర్వం ఇక్కడ బంగారు పల్లెం ఉండేదని గ్రామస్థులు చెబుతున్నారని పేర్కొన్నారు. గుట్టపైన చాళుక్యుల నాటి పునఃనిర్మాణం చేసిన శివాలయాన్ని దర్శించటానికి భక్తులు వస్తుంటారని చెప్పారు. ఈ చారిత్రక ఆధారాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి కోరారు.



ఖాత గుట్టపై గ్రూవ్స్‌ను చూపిస్తున్న పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి

'రామంతపూర్ ఊర చెరువు తూములకు మరమ్మతు చేయాలి'

మాసాయిపేట, జూన్ 12: మాసాయిపేట మండలం రామంతపూర్ గ్రామంలోని ప్రధాన ఊర చెరువుకు గల ప్రధాన తూములకు మరమ్మతులు చేయాలని గ్రామస్థులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు. గత వర్షాకాలంలో చెరువుకు గండ్లు పడి పెద్దఎత్తున నీరు బయటకు వెళ్లిపోయిందన్నారు. మరమ్మతులు చేయాలని ఏడాది నుంచి కోరుతున్నా.. ఇరిగేషన్ అధికారులు కానీ, రెవెన్యూ అధికారులు కానీ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

జీవో 970ను సవరించాలని వినతి

నర్సాపూర్, జూన్ 12: మున్సిపల్ కార్పొరేషన్లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నష్టం కలిగే విధంగా ఉన్న జీవో 970ను సవరించి తమకు న్యాయం జరిగేలా చూడాలని మున్సిపల్ ఉద్యోగులు మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, కమిషనర్ జైరామన్‌నాయక్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగే విధంగా ఉన్న ఈ జీవోను సవరించి సీనియారిటీ, విద్యార్హత ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.

ఉద్యోగుల సమస్యల పట్ల సీఎం సానుకూలం

టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్



మెదక్ అర్బన్, జూన్ 12: ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో పట్ల సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని, దశల వారీగా సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో సీఎంను కలిసి ఉద్యోగుల సమస్యలను లేవనెత్తగా పై విధంగా స్పందించారన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, 317 జీవో ద్వారా నష్టపోయిన ఉద్యోగులందరికీ న్యాయం చేకూర్చే విధంగా సబ్ కమిటీ పని చేస్తుందని రేవంత్‌రెడ్డి తెలిపినట్లు ఆయన వెల్లడించారు. ఆయన వెంట మెదక్ జిల్లా టీఎన్జీవోలు ఉన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధిపై ప్రాజెక్ట్

మెదక్ అర్బన్, జూన్ 12: మహిళల ఆర్థికాభివృద్ధికి దోహద పడేలా ఇంటర్ విద్యార్థిని అనిక పెన్నీఫిక్స్ పేరుతో ఓ ప్రాజెక్టు రూపొందించారు. బుధవారం మెదక్ మండల పరిధిలోని మాచవరంలో డ్వాక్రా సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించి, ప్రాజెక్టు ప్రయోజనాలను వివరించారు. అనిక మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుతో మహిళలకు చేతి పనులు, కాటేజ్ ఇండస్ట్రీస్, లెస్ తయారీ, గృహ వ్యాపారాలు, ఎంబ్రాయిడరీ వంటి లాభదాయకమైన పనులతో ఉపాధి పెంపొందడమే కాకుండా వారి ఆదాయ మార్గాన్ని పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మహాలక్ష్మి, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఆలస్యం?

నీట్-2024పై రగడే కారణం!.. తెలంగాణలో 56 కాలేజీల్లో 8,515 ఎంబీబీఎస్ సీట్లు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యకు సంబంధించి ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ఈ ఏడాది ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. నీట్-2024పై దేశ వ్యాప్తంగా జరుగుతున్న రగడే ఇందుకు కారణం. నీట్ మార్కులపై ఇప్పటికే సుప్రీం కోర్టులో కేసు నడుస్తోంది. నీట్-2024ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్న పిల్‌ను కోర్టు తోసిపుచ్చింది. కానీ, నీట్ విషయంలో మరిన్ని కేసులు పడే అవకాశం ఉందని, విషయం అంత త్వరగా తేలేట్లుగా కనిపించడం లేదని జాతీయ వైద్య విద్య కమిషన్(ఎన్ఎంసీ) అధికారులు రాష్ట్ర వైద్య విద్య ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. మరోపక్క, దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలు, వాటిలోని సీట్ల వివరాలను ఎన్ఎంసీ తన వెబ్‌సైట్‌లో పెట్టింది. విద్యార్థులు ఆయా కళాశాలల్లోనే చేరాలనే పేర్కొంది. ఎన్ఎంసీ వెబ్‌సైట్ ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు కలిపి తెలంగాణలో 56 వైద్య కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో మొత్తం 8,515 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి.

కొత్త కాలేజీల సంగతేంటో?

రాష్ట్రం ప్రభుత్వం దరఖాస్తు చేసిన కొత్త వైద్య కళాశాలల అనుమతిపై ఎన్ఎంసీ ఏటూ తేల్చడం లేదు. అనుమతి ఇస్తారో ? ఇవ్వరో కూడా స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో కొత్త కళాశాలల్లో ఈ ఏడాది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం అనుమానంగానే ఉంది. గద్వాల, వరంగల్(నర్సంపేట్), యాదాద్రి, మేడ్చల్ (కుత్బుల్లాపూర్), నారాయణపేట్, ములుగు, మెదక్, రంగారెడ్డి(మహేశ్వరం) జిల్లాల్లో వైద్య కళాశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆగస్టు- సెప్టెంబరులో ఎన్ఎంసీకి దరఖాస్తు చేసింది. ఆయా కళాశాలలను వర్చువల్‌గా, స్వయంగా తనిఖీ చేసిన ఎన్ఎంసీ బృందాలు పలు లోపాలను ఎత్తి చూపి వాటిని సరిచేసుకోవాలని సూచించాయి. ఆ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ లోపాలను సవరించింది. అయితే వైద్య కళాశాలలకు లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్ఓపీ) ఇచ్చేముందు ఎన్ఎంసీ బృందాలు మరోమారు తనిఖీ చేస్తాయి. మరికొద్ది రోజుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఎన్ఎంసీ బృందాలు ఇప్పటిదాకా మళ్లీ తనిఖీలకు రాలేదు. నిజానికి, తాము ఎత్తిచూపిన లోపాలను సరి చేసుకున్నట్టు చూపించిన తర్వాత వాటికి సంతృప్తి చెందితేనే ఎన్ఎంసీ అనుమతి ఇస్తుంది. ఒకవేళ అనుమతి ఇవ్వకపోతే ప్రభుత్వం అప్పీలు చేసుకునే వీలుంటుంది. ప్రభుత్వ కళాశాల కాబట్టి సర్కారే గ్యారంటీగా ఉండి లోపాలను సవరించుకుంటామని లిఖితపూర్వక హామీనిస్తుంది. దాంతో ఎన్ఎంసీ అనుమతి మంజూరు చేస్తుంది. ఈ వ్యవహారానికి 20-30 రోజుల సమయం పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. దీంతో త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరుతూ వైద్యవిద్య సంచాలకులు ఎన్ఎంసీకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎన్ఎంసీ ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది. మరోపక్క, అనుమతుల విషయమై కొన్ని వైద్య కళాశాలల యాజమాన్యాలు ఇప్పటికే కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి చర్చినట్టు సమాచారం.

గ్రూప్-1 మెయిన్స్ 7 రోజులు

(మొదటిపేజీ తరువాయి)

మీడియంలోనే రాయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న సమయంలోనే ఏ మీడియంలో రాసేదీ తెలపాల్సి ఉంటుంది. ఒక పరీక్ష తెలుగులో, మరో పేపర్‌ను ఇంగ్లి‌ష్‌లో రాయడానికి వీల్లేదు. అలా వేర్వేరు మాధ్యమాల్లో రాసినవారి పేపర్లను పరిగణనలోకి తీసుకోరు. రాష్ట్రంలో సుమారు 563 గ్రూపు-1 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను త్వరలోనే ప్రకటించనున్నారు. అందులో ఉత్తీర్ణులైనవారిని.. ఒక్కో పోస్టుకు 50 మంది అభ్యర్థుల చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేయనున్నారు. మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచే అభ్యర్థులను పోస్టులకు ఎంపిక చేస్తారు. ఈ నియామకాల్లో ఏలాంటి ఇంటర్వ్యూలూ ఉండవు. మెయిన్ పరీక్షలకు సంబంధించిన వివరాలను కమిషన్ అధికారులు బుధవారం వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం..

ఇదీ షెడ్యూలు

తేదీ	పేపర్
అక్టోబరు 21	జనరల్ ఇంగ్లిష్
అక్టోబరు 22	జనరల్ ఎస్సే (పేపర్-1)
అక్టోబరు 23	చరిత్ర, కల్చర్ అండ్ జాగ్రఫీ (పేపర్-2)
అక్టోబరు 24	ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం-గవర్నెన్స్ (పేపర్-3)
అక్టోబరు 25	ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ (పేపర్-4)
అక్టోబరు 26	సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ (పేపర్-5)
అక్టోబరు 27	తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ (పేపర్-6)

- పరీక్షల తొలిరోజు అయిన అక్టోబరు 21న క్వాలిఫైయింగ్ టెస్ట్ (జనరల్ ఇంగ్లిష్ పరీక్ష) నిర్వహించనున్నారు. అనంతరం ఇతర పేపర్ల పరీక్షలను నిర్వహిస్తారు. క్వాలిఫైయింగ్ టెస్ట్ కాకుండా మెయిన్స్‌లో మొత్తం 6 పేపర్లకు పరీక్షలను నిర్వహిస్తున్నారు.
- పరీక్షలన్నీ హైదరాబాద్, దాని చుట్టు పక్కల హెచ్ఎండీఏ పరిధిలోనే జరుగుతాయి.
- ప్రతిపేపర్‌లోనూ 150 మార్కులకు ప్రశ్నలుంటాయి.
- అభ్యర్థులు అన్ని పేపర్లూ రాయాల్సి ఉంటుంది. ఏ ఒక్క పరీక్షకు గైర్హాజరైనా ఆ అభ్యర్థులు రాసిన ఇతర పేపర్లను పరిగణనలోకి తీసుకోరు.
- క్వాలిఫయింగ్ పరీక్షను 10వ తరగతి ప్రమాణాలతో నిర్వహిస్తారు. ఇతర పేపర్ల పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను ఇప్పటికే ప్రకటించారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ కీ విడుదల

ఈ నెల 9వ తేదీన నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కీని విడుదల చేశారు. గురువారం (13వ తేదీ) నుంచి 17వ తేదీ మధ్య ఈ కీ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. కీపై అభ్యంతరాలుంటే.. 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తెలపాల్సిందిగా అభ్యర్థులకు అధికారులు సూచించారు.

నేడు లాసెట్ ఫలితాల విడుదల

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లాసెట్ ఫలితాలను ఈ నెల 13వ తేదీన విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. గురువారం సాయంత్రం 3.30 గంటలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఈ ఫలితాలను ప్రకటించనున్నారు.

నేటి నుంచి రెండోదశ దోస్త్

డిగ్రీలో ప్రవేశాలకు సంబంధించి 13వ తేదీ నుంచి రెండో దశ దోస్త్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు కానుంది. మొదటి దశలో సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 15వ తేదీలో ముగియనుంది. 14,15వ తేదీల్లో అభ్యర్థులు తమ వెబ్‌ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ఔటర్.. బంగారు బాతే!

వాహనాల రద్దీతో నెల నెలా పెరుగుతున్న ఆదాయం

- ఏప్రిల్‌లో రూ.60 కోట్లు..
- మే నెలలో 62.7 కోట్ల రాబడి



హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు.. ఆదాయ పరంగా బంగారు బాతు అన్నది స్పష్టమవుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీతో ఆదాయం భారీగా పెరుగుతోంది. ప్రతి నెలా హెచ్ఎండీఏ అధికారులు ఊహించని స్థాయిలో రాబడి వస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డును లీజుకు ఇచ్చే సందర్భంలో ఓ ప్రైవేటు ఏజెన్సీ మదింపు చేసిన ఆదాయ అంచనాలన్నీ తలకిందులవుతున్నాయి. అప్పుడు.. ఏడాదికి 2శాతం నుంచి 3శాతం వరకు ఆదాయం పెరుగుతుందని అంచనాలు వేయగా, ప్రస్తుతం ఒక్కో నెలకే 4శాతానికి పైగా పెరుగుతోంది. టోల్ చార్జీలు పెంచకముందే ఆదాయం ఈ స్థాయిలో పెరుగుతుండడంతో.. చార్జీల పెంపుతో మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఔటర్ ఆదాయంపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలు అక్షరసత్యాలు అని నిరూపితమవుతున్నాయి. గతేడాది ఔటర్ రింగ్ రోడ్డును హెచ్ఎండీఏ గత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిన విషయం తెలిసిందే. దీంతో ఏటేటా భారీ ఆదాయాన్ని సమకూర్చే ఔటర్‌ను చాలా తక్కువ బిడ్‌కు 30 ఏళ్లకు లీజుకివ్వడాన్ని ప్రస్తావిస్తూ.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతోపాటు ఔటర్‌పై ఏటా పెరిగే ఆదాయ, వ్యయాలను అంచనా వేసి చూపిస్తూ.. రాష్ట్రానికి బంగారు బాతు లాంటి ఔటర్‌ను ప్రైవేటుపరం చేయడాన్ని పేర్కొంటూ 'బంగారు బాతు.. బలి' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. ఈ కథనాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడంతోపాటు అప్పటి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాయి. విపక్షాలకు అస్త్రంగా మారాయి. ఆ కథనాలన్నీ ఇప్పుడు అక్షరసత్యాలుగా నిరూపితమవుతున్నాయి.

టోల్ చార్జీల పెంపుతో సంబంధం లేకుండానే

ఔటర్‌ను ప్రైవేటు సంస్థకు అప్పగించిన సందర్భంలో ఆదాయాన్ని మదింపు చేసిన ఏజెన్సీ. ఏటా 2శాతం నుంచి 3శాతానికి అటు, ఇటుగా రాబడి పెరుగుతుందని అంచనాలు వేసింది. ముఖ్యంగా హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ (డబ్ల్యూపీఐ) ప్రకారం ఏటా టోల్ చార్జీల్లో చోటుచేసుకునే 4శాతం నుంచి 5శాతం పెంపుదల మేరకే ఆదాయం పెరుగుతుందని ఆ ఏజెన్సీ తేల్చింది. సాధారణంగా ఏప్రిల్ నుంచి కొత్తగా అందుబాటులోకి వచ్చే టోల్ చార్జీలతో ఆ ఆర్థిక సంవత్సరానికి ఆదాయం పెరుగుతుందని హెచ్ఎండీఏ అధికారులు కూడా అంచనాలు వేశారు. కానీ, ప్రస్తుతం టోల్ చార్జీలు పెంచకుండానే ప్రతి నెలా ఆదాయం పెరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.60.2 కోట్ల ఆదాయం రాగా, మే నెలలో రూ.62.7 కోట్లు వచ్చింది. అంటే దాదాపు రూ.2.5 కోట్లు పెరిగింది. ఒక్క నెలకే 4.2 శాతం పెరుగుదల నమోదైంది. ఈ పెరుగుదల గతేడాది నుంచి కొనసాగుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ వాహనాల రద్దీ పెరుగుతుండడంతో ఆ మేరకు ఆదాయం పెరుగుతోంది. కాగా, డబ్ల్యూపీఐ ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ చార్జీలు ఏప్రిల్ 1 నుంచే పెరగాలి. కానీ, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని పెంచకుండా నిలిపివేశారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడంతో టోల్ చార్జీలు పెంచుకోవడానికి అవకాశం కల్పించారు. దాంతో ఈ చార్జీలు 4శాతం నుంచి 5శాతం మేర పెరిగాయి. ఇందుకు అనుగుణంగా ఆదాయం పెరుగుతుందని, వాహనాల రద్దీ ద్వారా వచ్చే ఆదాయం అదనంగా ఉంటుందని హెచ్ఎండీఏ- హెచ్‌జీసీఎల్‌కు చెందిన ఓ అధికారి తెలిపారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగులో లాభాలు అధికం

జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి సోమేశ్వర్‌రావు

సంగారెడ్డి టౌన్, జూన్ 12: డ్రాగన్ ఫ్రూట్ పంట సాగుతో లాభాలు అధికంగా ఉంటాయని జిల్లా ఉద్యాన, పట్టు పరి శ్రమల శాఖ అధికారి సోమేశ్వర్‌రావు అన్నారు. సంగారెడ్డి లోని కార్యాలయంలో బుధవారం జిల్లాలో డ్రాగన్ ఫ్రూట్ పంటను సాగుచేస్తున్న రైతులతో సదస్సును నిర్వహించారు. పంట సాగు, పంటను అమ్ముకునే క్రమంలో ఎదురవుతున్న సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా సోమేశ్వర్‌రావు మాట్లాడుతూ మే, జూన్ మాసాల్లో డ్రాగన్ ఫ్రూట్ పంట పూతదశకు వస్తుందన్నారు. ఎక్కువగా వచ్చిన పూతలో కొన్ని పూలను తొలగించడం వల్ల కాయ పరిమాణం పెరిగే అవకాశం ఉందని తెలిపారు. గ్రేడింగ్ చేయకుండా పండ్లను మార్కెట్‌కు తరలిస్తే ఆశించిన లాభా లు రావన్నారు. గ్రేడింగ్ చేసిన పండ్లకు మార్కెట్‌లో భాగా డిమాండ్ ఉన్నదన్నారు. ప్రీ కూలింగ్ తర్వాత కాయలను గ్రేడింగ్ చేసి, ప్యాకింగ్ చేయాలని సూచించారు. అయితే, శీతల గిడ్డంగులు లేకపోవడంతో కాయ నిలువ చేసుకునే అవకాశం లేదని పేర్కొన్నారు. డ్రాగన్ ఫ్రూట్ నిలువ, విక్రయానికి సంబంధించిన రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీధర్, ఫల పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుచిత్ర, శాస్త్రవేత్త హరికాంత్, ఉద్యానశాఖ అధికారులు శైలజ, సమత, బీశైలజ, కీర్తి పాల్గొన్నారు.

కలెక్టర్ల బడిబాట

పాఠశాలలను పరిశీలించిన జిల్లా బాస్‌లు: పుస్తకాలు, యూనిఫాం పంపిణీ


ఏటిగడ్డమాందాపూర్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

కొల్చారం/కొండపాక/రాయికోడ్, జూన్ 12: పాఠశాలల పునఃప్రారంభమైన మొదటి రోజు మూడు జిల్లాల కలెక్టర్లు బడిబాటలో భాగంగా పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫాంలను అందజేశారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం సంగాయిపేట, ఏటిగడ్డమాందాపూర్ పాఠశాలల్లో జరిగిన బడిబాట కార్యక్రమంలో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండల దుద్దెడ జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, సంగారెడ్డి జిల్లా రాయికోడ్‌లోని పలు పాఠశాలలను కలెక్టర్ వల్లూరి క్రాంతి పరిశీలించారు.

చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్



చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, చదువుతో ప్రపంచాన్ని జయించవచ్చునని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. కొల్చారం మండలం సంగాయిపేట, ఏటిగడ్డమాందాపూర్ పాఠశాలలను బుధవారం జిల్లా కలెక్టర్ సందర్శించి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో పాల్గొన్నారు. బుధవారం పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో సరస్వతీదేవీ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి పాఠశాల ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాల యూనిఫారాలు, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు జిల్లా విద్యాధికారి ప్రొ.రాధాకిషన్, ఎంపీపీ మంజుల కాశీనాథ్, జెడ్పీటీసీ మేఘమాల సంతోష్‌లతో కలిసి అందించారు. పాఠశాలలో అన్ని తరగతి గదులు తిరుగుతూ పరిశీలించారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యతను పరిశీలించారు. పాఠశాల విద్యార్థులను గణితంలో పలు ప్రశ్నలు అడుగుతూ వాటిని పరిష్కరించాలని సూచించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ జిల్లాలో 562 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా సుమారు రూ. 20 కోట్లతో అన్ని రకాల పెం డింగ్ పనులు పూర్తి చేయడంతో పాటు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. జిల్లాలోని పాఠశాలలో ఇప్పటి వరకు 93శాతం పెండింగ్ పనులు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో నీలకంఠం, ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు, తహసీల్దార్ మహ్మద్ గఫార్‌మియా, మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఏపీఎం సునిల్వ, ఏపీవో మహిపాల్‌రెడ్డి, సీఆర్పీలు సాయికుమార్, రాములు, శ్రీనివాస్, నాయకులు పెద్ది నారాయణ, ఆకుల రమేష్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో మానసిక ధృడత్వం పెంచాలి

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఏదైనా సాధించగలనని మానసిక ధృడత్వాన్ని పెంచాలని సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి అన్నారు. కొండపాక మండలం దుద్దెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట, పాఠశాల పునఃప్రారంభం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. విద్యార్థినీ, విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ తానూ మంచిర్యాల జిల్లాలోని దేవపూర్ అనే మారుమూల గ్రామంలో చదువుకున్నానని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 814 ప్రభుత్వ స్కూళ్లలో రూ. 35 కోట్లతో పనులు చేపట్టామని, మరో వారం, పదిహేను రోజులలో పనులు పూర్తయితాయని కలెక్టర్ తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్న 66 మందిని దుద్దెడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చేర్పించినందుకు, పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినందుకు పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, డీపీఓ దేవకీదేవి, ఎంఈఓ పి శ్రీనివాసరెడ్డి ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఎంపీపీ మంచాల అనసూయ, పాఠశాల హెచ్ఎం లక్ష్మి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ

రాయికోడ్‌లోని పలు పాఠశాలను బుధవారం సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పరిశీలించారు. ప్రాథమికోన్నత పాఠశాల, గురుకుల పాఠశాలను పరిశీలించి అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలలో తాగునీటి సమస్య కలెక్టర్ దృష్టికి రాగా, వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల నివేకలను తనకు అందజేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఈవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఎంఏ.శరీఫ్, ఎంఈవో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్, రెవెన్యు ఇన్స్ స్పెక్టర్ ప్రభాకర్, రామచందర్, మండల ప్రత్యేక అధికారి జగదీశ్వర్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.


రాయికోడ్‌లోని పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు


చిన్నకోడూరు: ప్రైమరీస్కూల్ విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజా

జిల్లావ్యాప్తంగా బుధవారం ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తొలిరోజునే విద్యార్థులకు యూనిఫామ్స్, నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్నకోడూరు, జూన్ 12: చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ పేర్కొన్నారు. బుధవారం స్కూళ్లు పునః ప్రారంభమైనందున చిన్నకోడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో హైస్కూల్, ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. విద్యార్థులు బాగా కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. అనంతరం పదోతరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులను జడ్పీ చైర్‌పర్సన్ శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పావయ్య పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య హై స్కూలు, ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● **సిద్దిపేట రూరల్:** సిద్దిపేట రూరల్ మండలంలోని ఇర్కోడు మోడల్ స్కూల్‌లో బుధవారం ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● **నారాయణరావుపేట:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీరాములు, ఎంపీవో శ్రీనివాస్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు సంతోష్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **హుస్నాబాద్‌రూరల్:** బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జి సరోజన పేర్కొన్నారు. బుధవారం హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లో బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, నోటుబుక్కులు, స్కూల్ యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, హెచ్ఎం మనీల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సిద్దిపేట రూరల్: మోడల్ స్కూల్ విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి

● **చేర్యాల:** కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామంలోని జడ్పీఎస్ఎస్‌లో విద్యార్థులకు ఎంపీపీ తలారి కీర్తన చేతుల మీదుగా స్కూల్ యూనిఫామ్స్, నోటుబుక్కులు పంపిణీ చేశారు. అలాగే కొమురవెల్లి మండలకేంద్రంలోని ప్రాథమిక, జడ్పీఎస్ఎస్‌లో జడ్పీటీసీ సిలివేరు సిద్దప్ప విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు అందజేశారు.

● **గజ్వేల్:** విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని శాసనమండలి సభ్యుడు డాక్టర్ వంటేరి యాదవరెడ్డి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ బాలుర పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సునిత, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ మహ్మద్ జకీయోద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షులు నస్రీన్ తదితరులున్నారు.

●**కుకునూరుపల్లి:** మండల వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, పాఠ్యపుస్తకాలను అందజేశారు. ప్రభుత్వ బడుల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని అధికారులు కోరారు.

● **ములుగు:** ములుగు మండలం కొక్కొండ, సింగన్నగూడ పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులకు ఎంపీపీ పెద్ద బాల్ లావణ్య అంజన్‌గౌడ్ చేతులమీదుగా యూనిఫాం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **మర్కుక్:** మండలంలోని అంగడికిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్, నోటు పుస్తకాలను ప్రధానోపాధ్యాయుడు ఓంకార్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జయదేవ్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ 2016లో అత్యంత దయనీయ స్థితిలో ఉన్న ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, గ్రామస్థుల కృషితో నేడు జాతీయ స్థాయిలో పురస్కారానికి నామినేట్ కావడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ గోలి నరేందర్, ఎస్ఎంసీ చైర్మన్‌బాల్‌రెడ్డి, ఏపీఎం బ్రహ్మచారి, గ్రామ నాయకులు, సీసీ కవిత, పంచాయతీ కార్యదర్శి నీలిమ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


హుస్నాబాద్ రూరల్: పోతారం(ఎస్)లో విద్యార్థులకు యూనిఫామ్ అందజేస్తున్న బీసీ వెల్ఫేర్ అధికారి

● **జగదేవ్‌పూర్:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేశారు. కాగా రెండు మూడేళ్లుగా మూతబడిన నిర్మల్‌నగర్ ప్రభుత్వ పాఠశాల బుధవారం పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బాలేషంగౌడ్, ఉదయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు దుస్తులు, నోటు పుస్తకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● **వర్గల్:** వర్గల్ మండలం నాచారం ప్రభుత్వ పాఠశాలలో బుధవారం మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు జాలిగామ వెంకటేశ్‌గౌడ్ విద్యార్థులకు యూనిఫామ్స్, పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. వర్గల్ జడ్పీహెచ్ఎస్ పునఃప్రారంభోత్సవ కార్యక్రమంలో జడ్పీటీసీ బాలు యాదవ్ ఎంపీపీ లతారమేశ్‌గౌడ్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పొడి చెత్త, తడి చెత్త యూనిట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్ గౌడ్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**రాయపోల్:** మండలంలోని రాంసాగర్ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను నోడల్ ఆఫీసర్ సత్యానారాయణరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లక్ష్మి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ శైలజ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సీఆర్పీ స్వామిగౌడ్ పాల్గొన్నారు.

● **కొండపాక:** ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులతో కూడిన విద్య ప్రభుత్వం అందిస్తుందని డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి అన్నారు. కొండపాక బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల పునః ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని, విద్యార్థులకు నోట్ పుస్తకాలు పాఠ్యపుస్తకాలు యూనిఫామ్స్‌తో పాటు దాతలు అందించిన స్కూల్ బ్యాగులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ మంచాల అనసూయ కనకరాములు, గ్రామ స్పెషల్ ఆఫీసర్ అమీనా, పంచాయతీ కార్యదర్శి స్వప్న, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ భూలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గజ్వేల్: ప్రజ్ఞాపూర్ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి

● **మద్దూరు:** మద్దూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పభుత్వం అందించిన యూనిఫాంతో పాటు పాఠ్యపుస్తకాలను జడ్పీటీసీ గిరికొండల్‌రెడ్డి విద్యార్థులకు అందించి మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రవేటు పాఠశాలలకు కాకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొప్పె కనకమ్మ, హెచ్ఎం. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **దూళిమిట్ట:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ నాచగోని పావనలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **దౌల్తాబాద్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల పునః ప్రారంభోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో బండి నర్సవ్వ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్‌ను అందజేశారు. కార్యక్రమంలోఉపాధ్యాయులు రాజయ్య, కవిత, వసంత, లక్ష్మిమంజుల, సీఆర్పీలు పాల్గొన్నారు.


మర్కుక్: విద్యార్థులతో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్, అధికారులు

గడ్డిమందు తాగిన వ్యక్తి మృతి


బాల్‌నర్సయ్య(ఫైల్)

సిద్దిపేట రూరల్, జూన్ 12: గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని బుస్సాపూర్‌లో చోటు చేసుకుంది. సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుస్సాపూర్ గ్రామానికి చెందిన ఉప్పరి బాల్ నర్సయ్య(35)కు ఆరేళ్ల క్రితం సిద్దిపేట పట్టణానికి చెందిన రోజాతో వివాహం జరిగింది. బాల్ నర్సయ్య పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో పని లేకపోవడం, ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం పొలం వద్ద గడ్డి మందు తాగాడు. ఈ విషయాన్ని భార్యకు ఫోన్‌లో చెప్పాడు. కుటుంబీకులు వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించఆ అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య రోజా 7 నెలల గర్భిణి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపారు.

హైనా దాడిలో దూడ..


మృతి చెందిన దూడ

చిన్నకోడూరు, జూన్ 12: హైనా దాడిలో దూడ మృతి చెందిన సంఘటన మండలంలోని మాచాపూర్ గ్రామంలో బుధవారం జరిగింది. అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మాచాపూర్ గ్రామానికి చెందిన రైతు కర్రె తిరుపతి మంగళవారం సాయంత్రం పశువులను తన వ్యవసాయ బావి వద్ద ఉన్న పాకలో కట్టేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం తెల్లవారు జామున బావి వద్దకు వెళ్లి చూడగా దూడ తీవ్ర గాయాలతో మృతి చెంది ఉంది. సమాచారం అందుకున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకోని దూడపై దాడి చేసిన ఆనవాళ్లను బట్టి హైనా అని నిర్ధారించారు. చుట్టూ పక్కల గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

బెల్ట్‌షాపులకు వ్యతిరేకంగా ఫలించిన మహిళల సమరం

● చిట్యాలను సందర్శించిన ఎక్సైజ్ అధికారులు, పోలీసులు


చిట్యాల గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎక్సైజ్, పోలీసు అధికారులు

చేర్యాల, జూన్ 12: బెల్టుషాపులు తొలగించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన మహిళలు చేపట్టిన సమరం ఎట్టకేలకు ఫలించింది. గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలు నిలిపివేయించాలని అధికారులకు విన్నవించినా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో మహిళలు తామే బెల్ట్‌షాపు నిర్వాహకుల ఇళ్లముందు ఆందోళన చేపట్టారు. దీంతో ఎక్సైజ్, పోలీసు అధికారులు దిగివచ్చి బుధవారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులు కొనసాగిస్తే చట్టపరచర్యలు తీసుకుంటామని నిర్వాహకులకు హెచ్చరించారు. ఇకపై గ్రామంలో మద్యం విక్రయాలు జరపకుండా చర్యలు చేపడతామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. అనంతరం ఓ బెల్ట్‌షాపులో మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నారు.

ఇసుక వేలం ద్వారా రూ.56వేల ఆదాయం

చేర్యాల, జూన్ 12 : చేర్యాల మండలం కమలాయపల్లి గ్రామశివారులో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 15ట్రాక్టర్ ట్రిప్పులమేర ఇసుక విక్రయానికి రెవిన్యూ అధికారులు బుధవారం వేలంపాటలు నిర్వహించారు. ఈసందర్భంగా రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వేలం చేపట్టగా, పలువురు పాల్గొన్నారు. గుత్తి వెంకటయ్య రూ.56వేలకు హెచ్చుపాట పాడి ఇసుకను స్వాధీనం చేసుకున్నారని ఆర్ఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

'సమన్వయంతో మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి'

నారాయణారివుపేట, జూన్ 12: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఎంపీపీ బాలకృష్ణ పేర్కొన్నారు. నారాయణరావుపేట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ భవనంలో పదవీ కాలంలోని చివరి మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. మొదటగా వివిధశాఖలకు చెందిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మాజీ మంత్రి హరీశ్‌రావు సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లామని తెలిపారు. రాబోయే రోజుల్లో మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని ప్రజాప్రతినిధులను, అధికారులను కోరారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీరాములు, ఎంపీవో శ్రీనివాస్, ఏఈలు తిరుపతి, సత్యం, ఎంఈవో యాదవరెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు సంతోష్‌కుమార్, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిద్దిపేట టౌన్, జూన్ 12: సిద్దిపేట పట్టణంలోని పలు వార్డుల్లో వైర్లకు తగిలే చెట్ల కొమ్మల నరికివేత కారణంగా గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు విద్యుత్ ట్రాన్స్‌కో సిద్దిపేట సబ్ డివిజన్ ఏడీఈ ఎన్.సుధాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని శివాజీనగర్, శ్రీనగర్‌కాలనీలలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, పట్టణంలోని పటేల్‌పురా, అంబేడ్కర్‌నగర్, సంజీవయ్యనగర్, వేములవాడ కమాన్, శంకర్‌నగర్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, బోయిగల్లి సాజిద్‌పురా, వీవీనగర్, పారుపల్లి, దోభీగల్లీ, లాల్‌కమాన్, నెహ్రూపార్కులలో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

● తొగుట, జూన్ 12: మండలంలోని తుక్కాపూర్ ఫీడర్ మరమ్మతులలో భాగంగా 33/11 కేవీ తుక్కాపూర్, లింగంపేట, తొగుట, తుక్కాపూర్, రాంపూర్, లింగాపూర్ సబ్ స్టేషన్ పరిధిలలో ఈ నెల 13న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తుక్కాపూర్ ఏడీఈ శ్రీనివాసరావు తెలిపారు. ఆయా విద్యుత్ సబ్ స్టేషన్‌ల ఫీడర్ పరిధిలోని చందాపూర్, రాంపూర్, జప్తిలింగారెడ్డిపల్లి, వెంకట్రావుపేట, లింగాపూర్, కొండపాక మండలంలోని మిషన్ భగీరథ, తిప్పారం, మంగోల్ గ్రామాల్లో అన్ని వ్యవసాయ, ఇండస్ట్రియల్ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు, రేపు మున్సిపల్ నీటి సరఫరా బంద్

సిద్దిపేట టౌన్, జూన్ 12: పట్టణంలోని మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో గురు, శుక్రవారాల్లో మున్సిపల్ నీటి సరఫరా బంద్ చేస్తున్నట్లు కమిషనర్ ప్రసన్నరాణి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మల్లన్నసాగర్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా సరఫరా అయ్యే తాగు నీటి మోటార్ల మరమ్మతుల దృష్ట్యా ఈ నెల 13, 14న నీటి సరఫరా ఉండబోదని తెలిపారు. పట్టణంలోని వార్డు నంబర్ 2, 3, 17 వార్డు నుంచి 28 వరకు, వార్డు నం, 31, 36 నుంచి 42 వార్డులలో నీటి సరఫరా జరగదని పేర్కొన్నారు.ఈ నెల 15 నుంచి యథావిధిగా నీటిసరఫరాను పునరుద్ధరించనున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో నిధులు లేవు.. విధులు నిర్వహించలేం

● ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసిన మండల కార్యదర్శులు

వర్గల్, జూన్ 12 : గ్రామపంచాయతీలలో నిధులు లేకపోవడంతో నిర్వహణ భారమవుతుందని, విధులు నిర్వహించలేకపోతున్నామని మండలంలోని 27 గ్రామపంచాయతీల కార్యదర్శులు బుధవారం వర్గల్ ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీవో కలీంకు వినతి పత్రం అందజేశారు. కొన్ని నెలలుగా రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు, కేంద్ర ఆర్థిక సంఘం నిధులు రాక గ్రామపంచాయతీల్లో నిర్వహించే ట్రాక్టర్ల నిర్వహణ, విద్యుద్దీపాల మరమ్మతులు తదితర పనుల కోసం కార్యదర్శులు చేతి నుంచి డబ్బు ఇవ్వాల్సివస్తోందన్నారు. 20 గ్రామపంచాయతీలలో గత నాలుగు నెలల నుంచి పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండలలోని వివిధ గ్రామపంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన హరీశ్‌రావు

సిద్దిపేట రూరల్, జూన్ 12;ఇటీవల మరణించిన వారి కుటుంబాలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు బుధవారం పరామర్శించారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ పంది శ్రావణ్ ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. ఇదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామశాఖ మాజీ ఉపాధ్యక్షుడు డప్పు బాబు తండ్రి ఎల్లయ్య అనారోగ్యంతో మరణించారు. ఇరు కుటుంబాలను మాజీ మంత్రి హరీశ్‌రావు పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. హరీశ్‌రావు వెంట ఎంపీపీ శ్రీదేవి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ధూళిమిట్ట, జూన్ 12: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను జడ్పీటీసీ గిరికొండల్ రెడ్డి, తహసీల్దార్ ఎర్రోళ్ల శ్యామ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 35 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.3,50,4,060 లు విలువ గల చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు.

పిడుగుపాటుకు గేదె మృతి

చేర్యాల, జూన్ 12: కొమురవెల్లి గ్రామానికి చెందిన పుట్ట రాజు వ్యవసాయ బావివద్ద బుధవారం పిడుగుపాటుకు గురై పాడి గేదె మృతి చెందింది. గేదె మృతితో రూ.60వేలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు రాజు కోరుతున్నాడు.

పిల్లలను బడిలో చేర్పించాలి

గజ్వేల్, జూన్ 12: బడీడు పిల్లల్ని బడిలో చేర్పించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి పిలుపునిచ్చారు. గజ్వేల్‌లోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో నిర్వహించిన బడిబాట ఆయన పాల్గొన్నారు.

తిగుల్‌లో ఆయిల్‌పామ్ రైతులకు శిక్షణ


ఆయిల్‌పామ్ రైతులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

జగదేవ్‌పూర్, జూన్ 12: మండలంలోని తిగుల్ గ్రామంలో ఆయిల్‌పామ్ రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి వసంతరావు పాల్గొని ఆయిల్‌పామ్ రైతులకు పలు సూచనలు చేశారు. ఆయిల్‌పామ్ మొక్కలకు వయస్సును బట్టి తగిన మోతాదులో నీరు, ఎరువులను అందించాలని తెలిపారు. నాటిన సంవత్సరం తర్వాత వచ్చే గెలలను తీసివేయాలని దీనికి అబ్లేషన్ టూల్ అనే పరికరం ద్వారా సులభంగా చేసుకోవచ్చని తెలిపారు. నాటిన 36 నెలల తర్వాత వచ్చే గెలలను వదిలి అవి నలుపురంగు నుంచి నారింజ రంగులోకి మారినప్పుడు గెలలు కోసి ఫ్యాక్టరీకి తరలించాలని తెలిపారు. మండలంలో 560 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశారని, ఇంకా ఎక్కువ మొత్తంలో రైతులు ముందుకు వచ్చి ఈ పంటను సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ విజయ్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు శరణ్య, భానుప్రకాష్, కిరణ్, రైతులు బట్టు సుధాకర్‌రెడ్డి, గండ్ల రాములు, బబ్బూరి రాములు, సందిరి మధు, వలబోజు వెంకటేశ్వరచారి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల కేటాయింపుపై విచారణ చేయించాలి

సిద్దిపేట టౌన్, జూన్12: సిద్దిపేట పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం కేటాయింపుల్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపించి, ఆ ఇళ్లను అర్హులైన పేద ప్రజలకు అందించాలంటూ సిద్దిపేట మున్సిపల్ కాంగ్రెస్ కౌన్సిలర్లు రియాజుద్దీన్,శ్రీదేవిబుచ్చిరెడ్డి, సాకిబాల్‌లక్ష్మిఆనంద్ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్‌క్యాంపు కార్యాలయంలో సిద్దిపేట కాంగ్రెస్ కౌన్సిలర్లు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ నిర్మాణం పూర్తయి నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను గుర్తించి అర్హులకు మాత్రమే కేటాయించాలని మంత్రి పొన్నంకు విన్నవించినట్లు తెలిపారు. దాంతోపాటు ఇటీవల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణిని కనీస గౌరవం ఇవ్వకుండా సభా వేదిక కింద కూర్చోబెట్టారని మంత్రికి వివరించారు. విధులు నిర్వర్తించే అధికారులపై చిన్నచూపు తగదన్నారు. వెంటనే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు వెల్లడించారు. మంత్రి పొన్నం సానుకూలంగా స్పందించారని, సమస్యల పరిష్కారానికి త్వరితగతిన తగిన చర్యలు తీసుకునేందుకు హామీ ఇచ్చారని కౌన్సిలర్లు తెలిపారు.


మంత్రి పొన్నంకు సమస్యలను వివరిస్తున్న కౌన్సిలర్లు

డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల
సమస్యలు పరిష్కరించాలి


గజ్వేల్‌లో తహసీల్దార్‌తో మాట్లాడుతున్న తూంకుంట నర్సారెడ్డి, నాయకులు

గజ్వేల్, జూన్ 12: భూనిర్వాసితులు, డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అధికారులకు విజ్ఞప్తి చేశారు. గజ్వేల్‌లోని ఐవోసీలో గల తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో బన్సీలాల్‌ను కలసి ఆయన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు చేసిన అనంతరం బీఆర్ఎస్ నాయకులు పలువురు డబ్బులు వసూలు చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, మీడియేటర్లు ఎవరికీ డాక్యుమెంట్లు ఇవ్వొద్దని, నేరుగా లబ్ధిదారులకు ఇవ్వాలని కోరారు. శ్మశానవాటిక ఏర్పాటు అంశంపై చర్చించారు. డబుల్ బెడ్ రూం లబ్ధిదారుల సమస్యను వెంటనే పరిష్కరించాలని, రోజురోజుకూ జటిలమవుతున్న నేపథ్యంలో పరిష్కారంపై చర్చించారు. అనర్హులకు ఇచ్చిన ఇళ్లను తొలగించేందుకు ప్రక్రియ చేపట్టాలని కోరారు. అనంతరం గజ్వేల్ పోస్టాఫీసుకు వెళ్లిన ఆయన పోస్టాఫీసుకు వచ్చే వృద్ధులు, ఇతరులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే కోఆపరేటివ్(పీఏసీఎస్) కార్యాలయాన్ని పోస్టాఫీస్ కార్యాలయంలోకి, పోస్టాఫీస్‌ను కోఆపరేటీవ్ కార్యాలయంలోకి మార్చేందుకు ప్రణాళిక చేయాలన్నారు. ఆయన వెంట టీపీసీసీ నాయకులు నాయిని యాదగిరి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పట్టణాధ్యక్షుడు మోహన్నగారి రాజు, నాయకులు తదితరులున్నారు.

భూనిర్వాసితులకు పని కల్పించండి

కొమురవెల్లి మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు వెంటనే ఉపాధి హామీ పని కల్పించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మల్లన్నసాగర్ ముంపు గ్రామాల కుటుంబాలకు గజ్వేల్ పట్టణ శివారుల్లో లేదా పరిసర ప్రాంతాల్లో ఎలాంటి ఉపాధి లేనందున చుట్టుపక్కల గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులను ప్రారంభించి వారికి జీవనభృతి కల్పించాలని లేఖలో ఆయన కోరారు.

గ్రంథాలయ పనులకు గ్రహణం

● బిల్లులు రాక నిలిచిన పనులు

● శంకు స్థాపన జరిగి ఏడేళ్లు

హుస్నాబాద్, జూన్ 12: హుస్నాబాద్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్మిస్తున్న నగర గ్రంథాలయ భవనం కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో పనులను నిలిపివేశారు. ఈ భవన నిర్మాణ పనులు మొదటి నుంచి ఆగుతూ.. సాగుతున్నాయి. పట్టణంలో ఉన్న గ్రంథాలయం శిథిలావస్థకు చేరడంతో నూతన భవన నిర్మాణం కోసం రూ. 50 లక్షలు మంజూరు చేశారు. 2017 ఆగస్టు నెలలో అప్పటి మంత్రి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం 85 శాతం పనులు పూర్తికాగా బిల్లులు రాక పనులు నిలిచిపోయాయి. దాదాపు ఏడేళ్లు గడుస్తున్నా ఇంకా ఈ భవనం పూర్తి కాకపోవడం పట్ల పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాంట్రాక్టర్‌కు బిల్లు మంజూరై చెక్కు తయారైనప్పటికీ ప్రస్తుతం ఆ చెక్కు కూడా పని చేయలేదని తెలిసింది. పట్టణంలో గ్రంథాలయానికి భవనం లేకపోవడంతో తాత్కాలికంగా రిటైర్డు ఉద్యోగుల సంఘం కార్యాలయ భవనంలో నిర్వహిస్తున్నారు. గ్రంథాలయానికి సొంత భవనం లేక పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగులు, పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు.పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తా


అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే

దుబ్బాక జూన్ 12: దుబ్బాక నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని దుబ్బాక ఎమెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఎస్ఈ వసంత నాయక్ ఆధ్వర్యంలో అధికారులతో కలిసి దుబ్బాక నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితిపై సమీక్షించారు. గతంలో మంజూరైన రోడ్ల పనులు నిలిచిపోయాయని, మెట్టు-అల్వాల రోడ్డుతో సహా నియోజకవర్గంలోని మిగతా రోడ్ల పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. దుబ్బాకలోని రామసంద్రం చెరువు కట్ట కింద రోడ్డుపైకి నీరు పారకుండా, మురికి కాలువ ఏర్పాటు చేయాలన్నారు. అందే-తిమ్మాపూర్, సూరంపల్లి నుంచి నాచారం, మొండి చింత నుంచి బేగంపేట సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలని చెప్పారు. హబ్సీపూర్-దుబ్బాక రోడ్డును 4 లైన్ల రోడ్డుగా, శిలాజీనగర్-గోసాన్‌పల్లి వద్ద బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని కోరారు. గతంలో అల్వాల బ్రిడ్జి తదితర పనుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ బాలప్రసాద్, డీఈలు వెంకటేశం, శ్రీనివాస్, విజయసారథితో పాటు కాంట్రాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ ప్లేట్లను వినియోగించవద్దు


కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్ టౌన్, జూన్ 12: ప్లాస్టిక్ ప్లేట్లను వినియోగించవద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత పట్టణ ప్రజలను కోరారు. బుధవారం ఆమె వార్డు ఆఫీసర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ జీరోవేస్ట్ ఈవెంట్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్లాస్టిక్‌ప్లేట్లకు బదులు స్టీల్‌ప్లేట్లు లేదా విస్తరాకులను వినియోగించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్, కౌన్సిలర్లు నళినిదేవి, పెరుక భాగ్యరెడ్డి, రమాదేవి, చిత్తారి పద్మ, దొడ్డి శ్రీనివాస్, గూళ్ల రాజు, జనగామ రత్నమాల, వల్లపు రాజు, వాల సుప్రజ, అయిలేని శంకర్‌రెడ్డి తదితరులున్నారు.

వడదెబ్బ మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

హుస్నాబాద్ టౌన్, జూన్ 12 : వేసవిలో వడదెబ్బతో మృతి చెందినవారి కుటుంబాలను ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేద కూలీల కుటుంబాల్లో ఇంటి పెద్ద చనిపోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలన్నారు.

22న హెచ్‌సీఏ టాలెంట్ హంట్


దేవ్‌రాజ్

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి) హైదరాబాద్, జూన్ 12: ఫాస్ట్ బౌలర్ల కోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ప్రత్యేకంగా టాలెంట్ హంట్ నిర్వహిస్తోందని కార్యదర్శి దేవ్‌రాజ్ తెలిపారు. ఈ నెల 22న ఉప్పల్ స్టేడియంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ టాలెంట్ హంట్‌ను నిర్వహించనున్నామన్నారు. ఆసక్తి గల క్రికెటర్లు వచ్చే శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి తమ పేర్లను హెచ్‌సీఏ అధికారిక వెబ్‌సైట్(www.hycricket.in)లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అయితే ఈ ప్లేయర్లు గతంలో హైదరాబాద్ జట్టుకు కానీ, బీసీసీఐకి ఆడిన వారై ఉండకూడదని, ఈ టాలెంట్ హంట్ పూర్తిగా కొత్త వాళ్లకు కోసం చేపడుతున్నట్టు చెప్పారు.